సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 13 । మార్చి । 2024



పాట్లు పడితేనే పాస్‌పోర్ట్

విదేశాలకు వెళ్లే వారే కాకుండా ఇతర అవసరాల కోసం పాస్‌పోర్ట్ తీసుకునేవారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 8లో



అడవి బాటలో నడిచి..

అటవీ ప్రాంతంలోని గొత్తికోయల ఆవాసాలకు ఐసీడీఎస్ బృందం కాస్త దూరం నడిచి, మరికొంత దూరం ట్రాక్టర్‌పై వెళ్లింది. 8లో



వాతావరణం

జిల్లాలో బుధవారం మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం వరకు వడగాలులు వీచే అవకాశం ఉంది.



కార్పొరేషన్‌కు ప్రతిపాదన..

పాల్వంచ, కొత్తగూడెం పురపాలికల విలీనంతో..

- నగర పాలక సంస్థ గ్రోత్ ఇంజిన్‌గా మారే అవకాశం
- ఇప్పటికీ అన్ని రంగాల్లో వెనుకబడిన జంట పట్టణాలు
- అప్‌గ్రేడ్ అయితే ఏజెన్సీ అభివృద్ధికి అవకాశాలు!



కొత్తగూడెం పట్టణ వ్యూ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జంట పట్టణాలుగా ఉన్న కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతోపాటు సమీప గ్రామాలను కలుపుతూ కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. ఈ మేరకు సీఎం జిల్లా పర్యటన సందర్భంగా వినతి పత్రం సమర్పించారు.

ప్రైవేటు పెట్టుబడులకు ఆస్కారం

తెలంగాణ ఏర్పాటు తర్వాత పది జిల్లాలను 33 జిల్లాలుగా విభజించారు. ఈ క్రమంలో కొత్తగూడెం కేంద్రంగా జిల్లా ఏర్పాటైంది. కలెక్టర్ కార్యాలయం, మెడికల్ కాలేజీ, ఎస్పీ కార్యాలయం తదితర కీలక కార్యాలయాలు అన్నీ పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోనే వెలిశాయి. మరికొన్ని కార్యాలయాలు కొత్తగూడెంలో ఉన్నాయి. కొత్తగా పోలీస్ బెటాలియన్ మంజూరైంది. అయినా సిద్దిపేట, భూపాలపల్లి, వనపర్తి, జగిత్యాల వంటి ఇతర కొత్త జిల్లా కేంద్రాలతో పోల్చితే అభివృద్ధిలో ఇటు కొత్తగూడెం, అటు పాల్వంచలు వెనకబడ్డాయి. ఇప్పటికీ విద్య, వైద్యం తదితర రంగాల్లో ఖమ్మం కార్పొరేషన్‌పైనే ఈ జిల్లా ప్రజలు ఆధారపడాల్సి వస్తోంది. ప్రభుత్వం అందించే నిధులు తప్ప ఇక్కడ ప్రైవేటు రంగం నుంచి ఆశించిన స్థాయిలో పెట్టుబడులు రావడం లేదు. ఇక ప్రభుత్వం నుంచి వివిధ రూపాల్లో మున్సిపాలిటీలకు అందే నిధులన్నీ డ్రెయినేజీ, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలకే సరిపోతున్నాయి తప్పితే రెండు పట్టణాల భవిష్యత్తు, రూపురేఖలు మార్చే పనులు చేసేందుకు వెసులుబాటు దొరకడం లేదు.

కార్పొరేషన్‌గా మారితే..

భద్రాద్రి కొత్తగూడెం పూర్తిగా ఏజెన్సీ జిల్లాగా ఉంది. జిల్లా వ్యాప్తంగా విస్తారంగా సహజ వనరులు ఉన్నాయి. ఎప్పటి నుంచో పారిశ్రామికంగా ముందు వరుసలో ఉంది. అయినప్పటికీ గ్రోత్ ఇంజన్ వంటి పట్టణం/నగరం జిల్లాలో కరువైంది. ఇక్కడ ప్రజలు విద్య, వైద్యం తదితర రంగాల్లో మెరుగైన సేవలు, జీవన ప్రమాణాల కోసం ఇప్పటికీ ఖమ్మం, విజయవాడ, వరంగల్ వంటి నగరాలపైనే ఆధారపడుతున్నారు. ఆధునిక జీవన ప్రమాణాలకు తగ్గ సౌకర్యాలు ఇంకా జిల్లా కేంద్రంలో అందుబాటులోకి రాలేదు. దీంతో ఇక్కడ పరిశ్రమల్లో పని చేస్తున్న ఉన్నతోద్యోగులు, తమ కుటుంబాలను సమీపంలోని నగరాల్లోనే ఉంచుతున్నారు. మారుమూల ప్రాంతాల్లోని ఆస్పత్రులు, స్కూళ్లలో పని చేసేందుకు ఉద్యోగులు సుముఖత చూపడం లేదు. ఈ నేపథ్యంలో కొత్తగూడెం కార్పొరేషన్‌గా మారితే ప్రభుత్వం నుంచి నిధులు, ప్రైవేటు రంగం నుంచి కూడా పెట్టుబడులు ఎక్కువగా వస్తాయని, ఫలితంగా జిల్లా కేంద్రం రూపురేఖలు మారుతాయనే అంచనాలు నెలకొన్నాయి. తద్వారా కొత్తగా పరిశ్రమలు రావడంతో పాటు మారుమూల ఏజెన్సీ ఏరియాలో పని చేసేందుకు తటపటాయిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఇక్కడ తమ సేవలు అందించేందుకు సంకోచాన్ని వీడతారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో రెండు మున్సిపాలిటీలను కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌కు మద్దతు పెరుగుతోంది.

రెండున్నర లక్షల జనాభా

కొత్తగూడెం మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా దాదాపు 90 వేల జనాభా ఉంది. పాల్వంచ మున్సిపాలిటీలో 24 వార్డులు ఉండగా లక్ష వరకు జనాభా ఉంది. ఇక కొత్తగూడెం మున్సిపాలిటీలో కలిసిపోయినట్టుగా లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, పాల్వంచ మండలాల్లో చాలా గ్రామపంచాయతీలు దశాబ్దాల కిందటే అర్బన్ ప్రాంతాలుగా మారాయి. కొత్తగూడెం, పాల్వంచలతోపాటు సమీప సెమీ అర్బన్ ప్రాంతాలను కలిపితే జనాభా రెండున్నర లక్షలకు మించి ఉంటుంది. పైగా ఇక్కడ నివసిస్తు న్న జనాభాలో నూటికి తొంభైశాతం మంది వ్యవసాయేతర రంగాల ఆధారంగానే జీవనోపాధి పొందుతున్నారు. దీంతో కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల్లో ఈ అర్బన్ ప్రాంతాలను కలుపుతూ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది.

కార్పొరేషన్‌గా చేయాలి



పారిశ్రామిక ప్రాంతాలైన కొత్తగూడెం, పాల్వంచలు దశాబ్దాల కిందటే పట్టణాలుగా రూపాంతరం చెందాయి. ఆ తర్వాత మున్సిపాలిటీ పరిధిని దాటి పట్టణ ప్రాంతం విస్తరించింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అనేక పెద్ద మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా మార్చారు. అయితే కొత్తగూడెం, పాల్వంచ విషయంలో ఈ తరహా ప్రయత్నం జరగలేదు. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా ఇక్కడ కార్పొరేషన్ వ్యవస్థను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

–కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే

రాబోయే ఎన్నికలకు ఏర్పాట్లు

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అదనపు కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాబోయే ఎన్నికలకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి కలెక్టర్ ప్రియాంక, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ హాజరయ్యారు. స్వీప్ కార్యక్రమాల నిర్వహణ, పెండింగ్ ఓటరు దరఖాస్తులపై చర్చించి మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు మధు, దామోదర్, జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి, డీఈఓ వెంకటేశ్వరాచారి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ దారా ప్రసాద్, కొత్తగూడెం, భద్రాచలం, అశ్వారావుపేట, పినపాక, ఇల్లెం తహసీల్దార్లు పుల్లయ్య, శ్రీనివాస్, కృష్ణప్రసాద్, రాఘవరెడ్డి, రవికుమార్, ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

సస్యరక్షణపై రైతునేస్తం శిక్షణ



కోయగూడెం రైతు వేదికలో రైతునేస్తం శిక్షణకు హాజరైన అధికారులు, రైతులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని ఐదు రైతు వేదికల్లో మంగళవారం రైతు నేస్తం లైవ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి, బూర్గంపాడు, ములకలపల్లి, చర్ల, టేకులపల్లి మండలం కోయగూడెం రైతు వేదికల్లో ఈ కార్యక్రమాలు చేపట్టారు. కోయగూడెం రైతువేదికలో జరిగిన శిక్షణా కార్యక్రమానికి జిల్లా వ్యసాయాధికారి బాబూరావు హాజరయ్యారు. మామిడిలో పూత రాలటం–యాజమాన్య పద్ధతులపై డాక్టర్ సుచరిత, అధిక ఉష్ణోగ్రతలు– పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ శ్రీనివాస్, సేంద్రియ వ్యవసాయంపై డాక్టర ప్రగతికుమారి, వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపిలు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డిలు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. రైతులు వ్యవసాయంలో వస్తున్న నూతన పద్ధతులను తెలుసుకుని లాభసాటి వ్యవసాయం చేసుకోవాలని సూచించారు. రాబోయే వానాకాలం నుంచి రాష్ట్ర ప్రభుత్వం పంటల భీమా పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. రైతుల తరఫున ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి పథకం అమలు చేస్తామన్నారు.

వరిపంటలో..

చంద్రుగొండ : వరిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి బాబూరావు రైతులకు సూచించారు. మండలంలోని దామరచర్ల గ్రామంలో మంగళవారం ఆయన వరిపంటను పరిశీలించారు. పంట ప్రస్తుతం పొట్టదశలో ఉందని, నీటిఎద్దడి లేకుండా చూసుకోవాలన్నారు. కాండం తొలుచు పురుగు కన్పిస్తే హైడ్రోక్లోరెడ్ పొడి మందును పంటపై పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. రైతులకు అవగాహన కల్పించి పామాయిల్ సాగు విస్తీర్ణం పెంచాలని వ్యవసాయాధికారులకు చెప్పారు. ఏఓ వినయ్, ఏఈఓ విజయ్ పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో ఈ నెల 16న నిర్వహించనున్న జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి.భానుమతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాక్సిడెంట్ కేసులు, సివిల్, చీటింగ్, చిట్ ఫండ్, భూతగాదాలు, వివాహ బంధాలకు సంబంధించిన కేసులు, చిన్న చిన్న దొంగతనం, ట్రాఫిక్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, బ్యాంక్ సంబంధిత తదితర కేసులు రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి కోరారు.

న్యూస్‌రీల్

కనుల పండువగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలను గావించారు.

రైల్వే గూడ్స్ షెడ్‌కు శంకుస్థాపన



గూడ్స్ షెడ్ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు రూరల్ : రూ.85 వేల కోట్లతో చేపట్టనున్న భారతీయ రైల్వే ఆధునికీకరణ పనులు, నిర్మాణాలకు మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. మణుగూరు రైల్వేస్టేషన్‌లో గూడ్స్ షెడ్‌కు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. రైల్వేస్టేషన్ మాస్టర్‌తోపాటు వైస్ ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ చందా సంతోష్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, కాటిబోయిన నాగేశ్వరరావు, తరుణ్‌రెడ్డి, ఎంపీటీసీ కోటేశ్వరరావు, వెంకటప్పయ్య పాల్గొన్నారు.

కఠినంగా వ్యవహరించాలి



స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

చంద్రుగొండ : చట్టవ్యతిరేక శక్తులపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశించారు. చంద్రుగొండ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు, క్రైంరేట్ పరిశీలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌తోపాటు ప్రాంగణాన్ని పరిశీలించారు. ఎస్‌ఐ మాచినేని రవి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శిరీష

కొత్తగూడెంరూరల్: జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు వైద్య సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి శిరీష తెలిపారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నేషనల్ టీబీ ఎలిమినేషన్ కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. టీబీ ఇండికేటర్లు ప్రజెంటివ్ ట్రీట్మెంట్ నోటిఫికేషన్ డీబీటీ, టీబీపీటీ, కాంటాక్ట్ టెస్టులను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్లు, ఎస్‌టీఎస్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: డీఎస్సీ ఎస్జీటీ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఖమ్మంలోని బీసీ స్టడీసర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ జి.శ్రీలత తెలిపారు. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు ఈనెల 14 నుండి 22వ తేదీలోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుంటే, ఇంటర్మీడియట్, టీటీసీ, టెట్ మార్కుల ఆధారంగా ఎంపిక చేసిన వారికి ఈనెల 26 నుండి 75 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే, హైదరాబాద్‌లో బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌పై ఉచిత శిక్షణ కోసం బీసీ అభ్యర్థుల దరఖాస్తు చేసుకోవచ్చని డైరెక్టర్ తెలిపారు. ఈనెల 15 నుండి 25లోగా స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, 31న ఖమ్మంలో జరిగే స్క్రీనింగ్ పరీక్ష ద్వారా 30 మందిని ఎంపిక చేస్తామని వెల్లడించారు.

డీఎస్సీ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్

డీఎస్సీ ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ లేదా పుస్తకాల కొనుగోలుకు రూ.1,500 అందజేయనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలో 10 వేల మందికి(7వేల మంది ఎస్జీటీ అభ్యర్థులు, 3వేల మంది స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థుల)కు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న బీసీ అభ్యర్థులు ఈనెల 14 నుండి ఏప్రిల్ 5వ తేదీలోగా స్టడీసర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 95738 59598, 08742–227427 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అంగన్‌వాడీల ఆందోళన

సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా



ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తొలుత ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజె రమేష్, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.పద్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు 5జీ టెక్నాలజీ ట్యాబ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, మే నెల మొత్తం టీచర్లకు, హెల్పర్లకు వేసవి సెలవులు ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు చీపురుకట్టలు, వంట పాత్రలు వంటి కనీస సౌకర్యాలు కల్పించాల్సింది పోయి, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానం ప్రవేశపెట్టడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మచారి, జిల్లా సహాయ కార్యదర్శులు డి.వీరన్న, కె.సత్య, జిల్లా నాయకులు భూక్య రమేష్, పాయం రాధాకుమారి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎం.విజయశీల, కళావతి, రాధ, సూరమ్మ, హేమలత, కృష్ణవేణి, లలిత తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం చేస్తా

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెంఅర్బన్: పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. పట్టణంలోని పాతకొత్తగూడెంలో 807 మంది పేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలను మంగళవారం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి 75 గజాల చొప్పున ఇళ్ల స్థలాలను కేటాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకోసం పాతకొత్తగూడెంలో కేటాయించిన స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సీతాలక్ష్మి, డీఎస్పీ రెహమాన్, ఎమ్మార్వో పుల్లయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, పలువురు వార్డు కౌన్సిలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఊపిరిలేని ఉద్యానం!

- ఉమ్మడి జిల్లాలో విరివిగా పండ్లు, కూరగాయల సాగు
- పంట ఉత్పత్తుల నిల్వ, మార్కెటింగ్ సౌకర్యాలు మృగ్యం
- ఇదే అదునుగా తక్కువ ధరకే కొంటున్న దళారులు
- ప్రభుత్వం తోడ్పాటునిస్తే రైతులకు ఆర్థిక పరిపుష్టి



తీగబారుతున్న బీరతోట

ఇల్లెందురూరల్: మార్కెటింగ్ సౌకర్యంలేక ఉమ్మడి జిల్లాలోని ఉద్యాన రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అతివృష్టి, అనావృష్టిని తట్టుకుని సాగు చేసిన పంటలను తక్కువ ధరలకే దళారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ఆదాయం గిట్టుబాటు కావడం లేదు.

పండ్ల తోటల విస్తీర్ణం ఇలా..

ఉమ్మడి జిల్లాలో మామిడి పంట 53 వేల ఎకరాల్లో సాగవుతుండగా, సుమారు 1.20 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది. జామ 800 ఎకరాల్లో సాగవుతుండగా, 15 టన్నులు, అరటి 2 వేల ఎకరాల్లో సాగవుతుండగా, 50వేల టన్నుల దిగుబడి, డ్రాగన్ ఫ్రూట్ 100 ఎకరాల్లో సాగవుతుండగా, 2 వేల టన్నుల దిగుబడి వస్తోంది. వీటితోపాటు నిమ్మ, సపోట, పనస, నేరేడు, ఉసిరి వంటి పంటల సాగు కూడా విస్తారంగా ఉంది. ఆయా పంటలు సుమారు 3 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్నట్లు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

వివిధ రకాల కూరగాయల సాగు..

ఉమ్మడి జిల్లాలో సీజన్‌ను బట్టి వివిధ రకాల కూరగాయలను విస్తారంగా పండిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 10,200 ఎకరాల్లో, ఖమ్మం జిల్లాలో 4,300 ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారు. రైతులు వ్యాపార పంటలకు ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగు చేపడుతున్నారు. కానీ విత్తన రాయితీ లేకపోవడం, ప్రభుత్వ తోడ్పాటు సన్నగిల్లడం, మార్కెట్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో గడిచిన ఐదేళ్లుగా కూరగాయల సాగు విస్తీర్ణంపై కొంత ప్రభావం చూపిందని చెప్పవచ్చు.

ముందుకు సాగని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

పంట ఉత్పత్తుల విక్రయం, ఎగుమతుల లక్ష్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలని గతంలో నిర్ణయించారు. ప్రత్యేకంగా ఖమ్మం, ఇల్లెందులలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను మంజూరు చేశారు. కానీ ఇప్పటి వరకు స్థలసేకరణ కూడా జరగలేదు. సత్తుపల్లిలో మాత్రమే ఫుడ్ పార్క్ నిర్మించినా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు.

నిల్వ, మార్కెటింగ్ సౌకర్యంలేక..

ఉద్యాన పంటలను కోసిన తర్వాత నిల్వ చేసేందుకు జిల్లాలో ఎలాంటి వసతులు లేవు. మార్కెటింగ్ సౌకర్యం కూడా అందుబాటులోలేదు. దీంతో దళారులకే విక్రయించాల్సి వస్తోంది. పండ్లు విక్రయానికి సిద్ధంగా ఉన్న సమయంలో దళారులు నేరుగా తోటల వద్దకు వెళ్లి గంపగుత్తగా కొనుగోలు చేస్తున్నారు. స్థానికంగా మార్కెట్ లేకపోవడంతోపాటు దూర ప్రాంతాలకు వెళ్లి మార్కెట్‌లో విక్రయించేందుకు అదనపు ఖర్చును భరించలేక రైతులు దళారుల అడిగిన ధరకే ఇచ్చేస్తున్నారు. కూరగాయల రైతులు కూడా తమ ఉత్పత్తులను తక్కువ ధరలకే విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విశాలమైన స్థలాల్లో వ్యవసాయ మార్కెట్‌లు ఉన్నాయి. పెద్ద పెద్ద గోదాములను కూడా నిర్మించారు. కానీ ఆయా మార్కెట్లలో ఉద్యాన ఉత్పత్తులను కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పండ్లు, కూరగాయల కొనుగోలు కేంద్రాలను నెలకొల్పాలని, గోదాములను మినీ కోల్డ్ స్టోరేజీలుగా మార్చాలని ఉద్యాన రైతులు కోరుతున్నారు.

విక్రయమే అసలు సమస్య



దశాబ్ద కాలంగా కూరగాయలు పండిస్తున్నాం. అతివృష్టి, అనావృష్టితో ఎలాగోలా పంటలు పండిస్తే చివరకు విక్రయించుకోవడం సమస్యగా మారింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక దళారులు చెప్పిన ధరకే విక్రయిస్తున్నాం.

– మంచె రమేష్, కూరగాయల రైతు, ఇల్లెందు మండలం

కోల్డ్ స్టోరేజీలు నెలకొల్పాలి



ఉద్యాన పంటలు కోసిన వెంటనే విక్రయించడం సాధ్యం కాదు. కోల్డ్ స్టోరేజీలు నెలకొల్పితే పంట ధర పెరిగే వరకు నిల్వ చేసుకోవచ్చు. నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ మార్కెట్‌ల్లో ఉద్యాన పంటల కొనుగోళ్లు చేపట్టాలి.

– మోకాళ్ల కృష్ణ, రైతు, మాణిక్యారం, ఇల్లెందు మండలం



కళకళలాడుతున్న ఉల్లి తోట



ఆశాజనకంగా కాకరసాగు

క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాయంత్రం హెలీకాప్టర్‌లో మధిరకు చేరుకుని మధిర నుంచి నిదానపురం వరకు నాలుగు లేన్ల రహదారి, మధిర నుంచి ఆత్కూరు బీటీ రోడ్డు విస్తరణ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత వైరా చేరుకుని సీతారామ ప్రాజెక్టు ద్వారా వైరా రిజర్వాయర్‌కు నీరదించేలా నిర్మించనున్న లింక్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేస్తారు. వైరాలో జరిగే కార్యక్రమంలో భట్టి, ఉత్తమ్‌తో పాటు మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా పాల్గొంటారు.

ఆక్రమణలు తొలగించిన అధికారులు



స్వాధీనం చేసుకున్న భూమిలో పెట్టిన బోర్డు

మణుగూరురూరల్: మండలంలోని మల్లారం రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 49లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి కట్టిన నిర్మాణాలను మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి మంగళవారం పోలీసుల సహకారంతో తొలగించారు. భూమిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హెచ్చరిక బోర్డ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాఘవరెడ్డి మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములకు సంబంధించి క్రయ విక్రయాలు చెల్లవని, ఎవ్వరు కూడా ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఆక్రమించి విక్రయాలకు పాల్పడొద్దని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీనివాస్, లీలావతి పాల్గొన్నారు.

పోలీసుల 'ఫ్లాగ్ మార్చ్'



వైరా : ఫ్లాగ్ మార్చ్‌లో పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు

వైరా/కల్లూరు: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలని వైరా, కల్లూరు, పెనుబల్లి ఎస్సైలు ఏ.వంశీకృష్ణ, షాకీర్, వెంకటేష్ కోరారు. వైరా, కల్లూరుల్లో మంగళవారం రాత్రి సీఆర్పీఎఫ్ బలగాలతో కలిసి కవాతు(ఫ్లాగ్ మార్చ్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సైలు మాట్లాడుతూ ఎన్నికల వేళ ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులకు అందరూ సహకరించాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

సత్తుపల్లిటౌన్: వీధి కుక్కలు వెంబడించి గాయపర్చడంతో చుక్కల దుప్పి మృతి చెందింది. సత్తుపల్లిలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు.. సత్తుపల్లిలోని ఎన్టీఆర్‌నగర్ వైపు ఉన్న సింగరేణి ఓబీ మట్టి దిబ్బల వైపు నుంచి వీధికుక్కలు అడవిలోకి ప్రవేశించి చుక్కల దుప్పిని వెంబడించాయి. దీంతో మెట్టు ఆంజనేయస్వామి గుడి సమీపాన అర్బన్‌పార్క్ ఫెన్సింగ్‌కు తగిలిన దుప్పి తీవ్రంగా గాయపడింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది స్థానిక పశువైద్యశాలకు తరలించగా చికిత్స చేయిస్తుండగానే మృతి చెందింది. డీఆర్ఓ ముత్యాలరావు, ఎఫ్‌బీఓ ముక్తి వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు.

పశువుల తరలింపు అడ్డగింత

ఇల్లెందురూరల్: పెద్దమొత్తంలో పశువులతో వెళ్తున్న రెండు వాహనాలను మండలంలోని సుభాష్‌నగర్ సెంటర్‌లో పోలీసులు మంగళవారం రాత్రి నిలిపివేశారు. కొత్తగూడెం నుంచి ఇల్లెందు మీదుగా వెళ్తున్న వాహనాల వివరాలు తెలుసుకున్న పోలీసులు స్టేషన్‌కు తరలించారు. వాహనాలలో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై సీఐ కరుణాకర్‌ను వివరణ కోరగా.. విచారిస్తున్నామని చెప్పారు.

జాతరలో తప్పిపోయిన మిర్యాలగూడెం వాసి



వరదరాజు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం తీర్థాలలో మహాశివరాత్రి సందర్భంగా జరిగిన జాతరకు వచ్చిన నల్లగొండ జిల్లా మిర్యాలగూడెంకు చెందిన కందరబోయిన వరదరాజు(56) తప్పిపోయాడు. ఈనెల 8న కుటుంబంతో కలిసి జాతరకు వచ్చిన ఆయన మధ్యలో విడిపోయాడు. ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియడంలేదని కుటుంబీకులు గోడు వెళ్లబోసుకున్నారు. కాగా, వరదరాజు కుటుంబం మిర్యాలగూడెం నందిపాడులోని ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా నివాసముంటోంది.

పాట్లు పడితేనే పాస్‌పోర్ట్

- సమస్యలకు నిలయంగా ఖమ్మంలోని కేంద్రం
- సిబ్బంది కొరత.. మౌలిక వసతుల లేమి
- వెరిఫికేషన్ అధికారి కూడా లేక అవస్థలు
- సమస్య తలెత్తితే హైదరాబాద్ కార్యాలయానికి వెళ్లాల్సిందే..

ఖమ్మంగాంధీచౌక్: విదేశాలకు వెళ్లే వారే కాకుండా ఇతర అవసరాల కోసం పాస్‌పోర్ట్ తీసుకునేవారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాస్‌పోర్ట్‌లు జారీ చేసేందుకు ఖమ్మంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేవా కేంద్రం సమస్యలకు నిలయంగా మారింది. గతంలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం హైదరాబాద్‌లో మాత్రమే ఉండగా.. విదేశాలకు వెళ్తున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతుండటంతో పోస్టాఫీసుల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం ఎంపీగా కొనసాగిన సమయంలో ఖమ్మంలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయించారు. తొలుత నిత్యం 50 స్లాట్లకు అవకాశం ఉండగా.. ఇప్పుడు 95 స్లాట్లు బుక్ చేసుకునే అవకాశముంది. అలాగే, వర్క్ వీసాపై విదేశాలకు వెళ్లే వారి కోసం మరో 15 స్లాట్లు కేటాయించారు. అయితే, ఈ కేంద్రం ఉమ్మడి జిల్లా వాసులకు ఉపయోగకరంగానే ఉన్నా అందుకు తగిన విధంగా సేవలు అందకపోవడం, గతంలో సమకూర్చిన సౌకర్యాలు ఇప్పుడు లేకపోవడంతో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

ఆన్‌లైన్‌లోనే పరిశీలన

ఖమ్మంలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేసిన సమయాన ఒక వెరిఫికేషన్ అధికారిని నియమించారు. అలాగే, తపాలా శాఖకు చెందిన ఇద్దరు పోస్టల్ అసిస్టెంట్లు, రక్షణ కోసం పోలీస్ శాఖకు చెందిన ఓ ఉద్యోగిని కేటాయించారు. అయితే, 2023 డిసెంబర్ తర్వాత వెరిఫికేషన్ అధికారి కేటాయింపు నిలిచిపోయింది. అదేమంటే హైదరాబాద్ పాస్‌పోర్ట్ రీజినల్ కార్యాలయంలో సిబ్బంది కొరత కారణంగా నియమించడం లేదని చెబుతున్నారు. వెరిఫికేషన్ అధికారి ఉంటే ఇక్కడే దరఖాస్తుదారుల సర్టిఫికెట్లు, ఇతర పత్రాలను పరిశీలిస్తారు. సదరు అధికారి లేని కారణంగా సర్టిఫికెట్లన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే హైదరాబాద్‌లోని రీజినల్ కార్యాలయంలో పరిశీలించి అనుమతించాకే పాస్‌పోర్ట్ జారీ అవుతోంది. ఏవైనా తప్పిదాలు ఉంటే దరఖాస్తుదారులు హైదరాబాద్ వెళ్లకతప్పటం లేదు. కొందరైతే రెండు, మూడు సార్లు వెళ్లాల్సి వస్తుండటంతో అవస్థ పడుతున్నారు.

నామమాత్రంగా సదుపాయాలు

ఖమ్మంలోని పాస్‌పోర్ట్ సేవా కేంద్రంలో సరైన సదుపాయాలు లేక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ కేంద్రానికి ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నల్లగొండ, మహబూబాబాద్ జిల్లాలే కాక కొన్నిసార్లు ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, జగిత్యాల, కరీంనగర్ తదితర జిల్లాల నుంచి కూడా వస్తున్నారు. పాస్‌పోర్ట్ స్లాట్ ఎక్కడి నుంచైనా బుక్ చేసుకునే అవకాశముండటంతో ఆన్‌లైన్‌లో ఖాళీగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సుదూర ప్రాంతాల వాసులు కూడా దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మొత్తం ఆన్‌లైన్‌లో ప్రక్రియ జరిగే ఈ కేంద్రంలో ఏసీ లేకపోవడంతో తరచుగా కంప్యూటర్లు మొరాయిస్తున్నాయని చెబుతున్నారు. ఇక ఆవరణలో సరిపడా కుర్చీలు లేక దరఖాస్తుదారులతో పాటు సహాయకులు కేంద్రం వెలుపల ఎండ, వానలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయాన పిల్లలతో వచ్చే వారు పడరాని పాట్లు పడుతున్నారు. ఇకనైనా తాగునీటి సౌకర్యం కల్పించి అటెండర్, వాచ్‌మెన్‌ను నియమించడంతో పాటు వెరిఫికేషన్ అధికారిని సైతం కేటాయించాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.



వినియోగదారులకు సేవలందిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది



సౌకర్యాలు లేక సేవా కేంద్రం బయట కూర్చున్న దరఖాస్తుదారులు

సిబ్బంది కొరతతో సతమతం

పోస్టల్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రంలో సరిపడా సిబ్బంది లేక అటు వినియోగదారులు, ఇటు ఉన్న ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో ఇద్దరు పోస్టల్ ఉద్యోగులు, ఒక పోలీస్ కానిస్టేబుల్ మాత్రమే పనిచేస్తుండగా.. నిత్యం 95 మంది ధ్రువపత్రాలను పరిశీలించటం, బయోమెట్రిక్ విధానంలో వివరాలు నమోదు చేయడం, వేలిముద్రలు, ఐరిష్ సేకరించడం కష్టంగా మారుతోంది.

మూడు సార్లు హైదరాబాద్ వెళ్లా..



ఇక్కడ వెరిఫికేషన్ అధికారి లేక పోవటంతో హైదరాబాద్ రీజినల్ కార్యాలయానికి మూడు సార్లు వెళ్లాల్సి వచ్చింది. ఖమ్మంలో పాస్‌పోర్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించలేదు. కూర్చోవడానికి కూడా వసతి లేదు. వెరిఫికేషన్ అధికారిని ఇకనైనా నియమించి సౌకర్యాలను మెరుగుపర్చాలి.

– డాక్టర్ పెద్దిరెడ్డి సుధీంద్రరెడ్డి, శ్రీరక్ష వైద్యశాల, ఖమ్మం

సిబ్బంది కొరతతో జాప్యం



పాస్‌పోర్ట్ కేంద్రంలో సరిపడా సిబ్బంది లేక ధ్రువపత్రాల పరిశీలన, ఇతర పనుల్లో జాప్యం జరుగుతోంది. వెరిఫికేషన్ అధికారి ఉంటే పనులు చకచకా జరుగుతాయి. సమస్య ఉన్నా ఇక్కడే పరిష్కారమవుతుంది. కానీ, ఇప్పుడు హైదరాబాద్ వెళ్లడం ఇబ్బందిగా ఉంటోంది. కార్యాలయంలో కూర్చోవడానికి కూడా సౌకర్యం లేదు.

– వి.సత్యనారాయణ, భద్రాద్రి కొత్తగూడెం

అడవి బాటలో నడిచి.. ట్రాక్టర్‌పై వెళ్లి..

గొత్తికోయల ఆవాసాల్లో 'పోషణ్ పక్వాడ్'

అశ్వారావుపేటరూరల్: దట్టమైన అటవీ ప్రాంతంలో రహదారి మార్గం లేని వలస గొత్తికోయల ఆవాసాలకు ఐసీడీఎస్ బృందం కాస్త దూరం నడిచి, మరికొంత దూరం ట్రాక్టర్‌పై వెళ్లింది. అనంతరం వారికి చిరుధాన్యాల వాడకం, లాభాలపై అవగాహన కల్పించారు. అశ్వారావుపేట మండలంలో దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఉండే రేగళ్ల, జిల్లేడుపాక, చెన్నాపురం కాలనీ, రెడ్డిగుంపు కాలనీల్లో మంగళవారం ఐసీడీఎస్ సీడీపీఓ రోజారాణి ఆధ్వర్యాన పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరు ధాన్యాల వాడకం, ఉపయోగాలను వివరించారు. అలాగే, చిన్నారులకు అందించాల్సిన పోషకాహారం, కేంద్రాల్లో అందుతున్న సేవలు, పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కాగా, గొత్తికోయ గ్రామాలకు సరైన రహదారి లేకపోవడంతో దాదాపు ఎనిమిది కి.మీ. మేర ఐసీడీఎస్ బృందం కాలినడక వెళ్లగా, చెన్నాపురం కాలనీకి ట్రాక్టర్‌పై వెళ్లారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



గొత్తికోయలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ రోజారాణి



గొత్తికోయల ఆవాసానికి ట్రాక్టర్‌పై వెళ్తున్న సీడీపీఓ రోజారాణి, ఉద్యోగులు

విద్యుత్ సమస్యలకు చెక్

- జిల్లాలో అభివృద్ధి పనులు
- విద్యుత్ ఎస్ఈ రమేశ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని కేటగిరీల విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు జిల్లాలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు విద్యుత్ ఎస్ఈ కె.రమేశ్ మంగళవారం తెలిపారు.

33/11 కేవీ సబ్ స్టేషన్లలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు

- మణుగూరు మండలంలోని గుట్టమల్లారం సబ్‌స్టేషన్‌లో రూ.30 లక్షలతో 3.15 ఎంవీఏ అదనపు పవర్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు.
- చంద్రుగొండ మండలం పోకలగూడెం సబ్‌స్టేషన్‌లో రూ.40 లక్షలతో 5 ఎంవీఏ అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు.
- మణుగూరు మండలం మణుగూరు సబ్‌స్టేషన్‌లో రూ.40 లక్షలతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీని 3.15 నుంచి 5 ఎంవీఏకు పెంచడం.
- దమ్మపేట మండలం నాగులపల్లి సబ్‌స్టేషన్‌లో రూ.60 లక్షలతో పవర్ స్టేషన్ కెపాసిటీని 5 నుండి 8 ఎంవీఏకు పెంచడం.
- భద్రాచలం మండలం భద్రాచలం సబ్‌స్టేషన్‌లో రూ.40 లక్షలతో 5 ఎంవీఏ అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ఉన్నతాధికారుల అనుమతి.
- కొత్తగూడెం ప్రగతినగర్ సబ్‌స్టేషన్‌లో రూ.40 లక్షలతో 5 ఎంవీఏ అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ఉన్నతాధికారుల అనుమతి.
- పాల్వంచ ఇందిరానగర్ సబ్‌స్టేషన్‌లో రూ.40 లక్షలతో 5 ఎంవీఏ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ఉన్నతాధికారుల అనుమతి.

కెపాసిటర్ల ఏర్పాటు..

విద్యుత్ సరఫరాలో లోవోల్టేజీ సమస్యను అధిగమించడానికి, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి జిల్లాలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో 65 కెపాసిటర్లు ఏర్పాటు చేశారు. వీటితోపాటుగా కొత్తగా నాలుగు కెపాసిటర్లను 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో ఒక్కొక్క దానికి రూ.11 లక్షల చొప్పున రూ.44 లక్షలతో ఏర్పాటు.

- జిల్లాలో 11 కేవీ లైన్లలో 40 కెపాసిటర్లను ఏర్పాటు చేయడం శారు. వీటితో పాటు ఎనిమిది కెపాసిటర్లను 11 కేవీ లైన్లలో రూ.8 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు.



కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎస్ఈ రమేశ్, విద్యుత్ అధికారులు

కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

విద్యుత్ సరఫరాలో లోవోల్టేజీ సమస్యలను అధిగమించి నాణ్యమైన విద్యుత్ సరఫరాకు జిల్లాలో నూతనంగా 26 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రూ.78లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు వారి వ్యవసాయ మోటార్లకు తగిన కెపాసిటర్లను అమర్చు కోవడం ద్వారా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ఉంటాయని విద్యుత్ ఎస్ఈ కె.రమేశ్ తెలిపారు.

20 మంది మైనింగ్ అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని వివిధ ఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్న 20 మంది మైనింగ్ అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో నలుగురు జీఎంలు, ముగ్గురు అదనపు జీఎంలు, ఆరుగురు డీజీఎంలు, ఒక ఎస్ఓఎం, ఇద్దరు కాలరీ మేనేజర్లు నలుగురు అడిషనల్ మేనేజర్లు ఉన్నారు. అలాగే, వివిధ ఏరియాల్లోని 21 మంది ఈఅండ్ఎం అధికారులు, మరో 10 మంది సివిల్ అధికారులను సైతం యాజమాన్యం బదిలీ చేసింది. వీరంతా కేటాయించిన స్థానాల్లో గడువులోగా విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మహిళకు పాముకాటు

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామానికి చెందిన చిట్టిమల్ల దుర్గారాణి పాముకాటుకు గురైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. తూరుబాక గ్రామ శివారులో ఉపాధి హామీ పనులకు వెళ్లి పని చేస్తున్న దుర్గారాణిని త్రాచు పాము కాటు వేసింది. వెంటనే ఆమెను భద్రాచలం ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. దుర్గారాణి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

హత్య కేసులో ఇద్దరు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వినయ్‌కుమార్

పాల్వంచరూరల్: పాత కక్షల నేపథ్యంలో ఐదురోజుల కిందట ఒక వ్యక్తిని హత్యచేసిన కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని బంజర కుంజావెంకయ్యగుంపు గ్రామానికి చెందిన కల్తీ మల్లయ్యను జోగా రాము, పూనెం శివ కలిసి ఈ నెల 8వ తేదీన హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో జోగా రాము, పూనెం శివను మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ వినయ్‌కుమార్ తెలిపారు.

ఇద్దరిపై కేసు


పాల్వంచరూరల్: వివాహితపై దాడికి పాల్పడిన ఆమె ఆడబిడ్డలపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని బంద్రుగొండ గ్రామానికి చెందిన కంటే సైదమ్మకు తన అత్త లక్ష్మికు మధ్య మంగళవారం వాగ్వాదం జరిగింది. దీంతో లక్ష్మి తన కుమార్తెలు సీతమ్మ, భద్రమ్మకు ఫోన్‌లో విషయం తెలిపింది. ఇంటికి వచ్చిన వారిద్దరూ కలిసి తనను కొట్టి బూతులు తిట్టారని సైదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీతమ్మ, భద్రమ్మపై కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

అదుపు తప్పిన వాహనం, వ్యక్తి మృతి

పిల్లలను హాస్టల్‌లో దింపి వస్తుండగా ఘటన

కారేపల్లి: ద్విచక్రవాహనం అదుపుతప్పగా కింద పడిన వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోలంపల్లికి చెందిన తేజావత్ రవికుమార్(35) ఇద్దరు కుమారులు ఖమ్మంలోని ప్రైవేట్ పాఠశాల హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. ఆదివారం వారిని ఇంటికి తీసుకొచ్చిన రవికుమార్ తిరిగి సోమవారం ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి హాస్టల్‌లో దింపాక రాత్రి తిరుగు పయనమయ్యాడు. ఈక్రమంలో మండలంలోని ఆలియాతండా వద్ద మూలమలుపులో ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న మట్టిదిబ్బలను ఢీకొట్టి ఎదురుగా ఉన్న ప్రహరీకి బలంగా తాకడంతో రవికుమార్‌కు తీవ్రగాయాలయ్యాడు. దీంతో ఆయనను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి కిమ్స్‌కు తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఘటనపై రవి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రాజారాం తెలిపారు.

వంట చెరకు స్వాధీనం



అటవీ అధికారులు పట్టుకున్న ట్రాక్టర్

జూలూరుపాడు: అక్రమంగా తరలిస్తున్న వంట చెరకును అటవీశాఖ అధికారులు సోమవారం రాత్రి జూలూరుపాడులో పట్టుకున్నారు. ఏన్కూరు మండలం నాచారానికి చెందిన పామర్తి శ్రీను జన్నారం నుంచి ట్రాక్టర్లలో వంట చెరకు తరలించి, జూలూరుపాడు శ్రీసాయి బాబా ఆలయ సమీపంలో లారీలో లోడ్ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న జూలూరుపాడు ఎఫ్ఎస్ఓ ఎం.హనుమంతు, బీట్ ఆఫీసర్ బి.నరసింహారావు ఘటనా స్థలానికి చేరుకొని వంట చెరకు లోడ్‌తో ఉన్న లారీ, ట్రాక్టర్లను పట్టుకొని స్థానిక ఎఫ్ఆర్ఓ కార్యాలయానికి తరలించారు. శ్రీనుకు రూ.25 వేల జరిమానా విధించినట్లు ఎఫ్ఆర్ఓ ప్రసాద్‌రావు మంగళవారం తెలిపారు.

గోద్రెజ్ ఏరియాలో జిల్లాను కలపొద్దు..



సమావేశంలో పాల్గొన్న ఆయిల్‌పామ్ రైతులు

సత్తుపల్లిటౌన్: టీఎస్ ఆయిల్‌ఫెడ్ ఏరియాను గోద్రెజ్ కంపెనీకి కేటాయించే ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని ఆయిల్‌పామ్ రైతులు డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో మంగళవారం జరిగిన ఆయిల్‌పామ్ రైతుల సంఘం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి ప్రసాద్, డైరెక్టర్లు వేంపాటి లక్ష్మీనారాయణ, బండి గుర్నాథరెడ్డి, చలసాని సాంబశివరావు మాట్లాడారు. రైతుల భాగస్వామ్యంతో టీఎస్ ఆయిల్‌ఫెడ్ నడుస్తుండగా.. దీన్ని కాదని గోద్రెజ్ కంపెనీకి ఏరియాను కేటాయించాలని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కంపెనీ ప్రతినిధులు కోరడం సరికాదన్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా గోద్రెజ్ ఏరియాలోని ఆయిల్‌పామ్ గెలలను ఏపీలో ఉన్న కంపెనీకి తరలిస్తుండగా ఏటా రూ.6 కోట్ల మేర జీఎస్టీ ని ప్రభుత్వం కోల్పోతుందని తెలిపారు. ముప్పై ఏళ్లుగా గోద్రెజ్ కంపెనీ ఈ ప్రాంతంలో ఫ్యాక్టరీ కూడా నిర్మించలేదని పేర్కొన్నారు. కాగా, ఆయిల్‌పామ్ ఫార్ములా ఫిక్సేషన్‌ను ఈ ఏడాది 19.02 నుంచి 19.17కి పెంచడంపై వారు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఆయిల్‌పామ్ రైతులు తుంబూరు కృష్ణారెడ్డి, చల్లగుళ్ల నర్సింహారావు, ఆళ్ల నాగేశ్వరరావు, ప్రసాద్‌రెడ్డి, విష్ణు, చీకటి చిట్టీరావు, పాలపాటి శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.